క్లుప్తంగా

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అందిపుచ్చుకోవాలి

కోడూరు: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను పంచాయతీలు అందిపుచ్చుకుని, గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీఓ సుధాప్రవీణ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై పంచాయతీ, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు అనుసరించాల్సిన అంశాలతో పాటు ఆరోగ్యవంతమైన సమాజం కోసం పంచాయతీలు చేయాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. పచ్చదనం పరిశుభ్రత, స్వయం సమృద్ధిగా మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామం అంశాలను ప్రొజెక్టర్‌పై వివరించారు. జిల్లా లింక్ అధికారి కె.శ్రీనివాసరావు, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఈఓపీఆర్డీ నాగరేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార నియమాలను బట్టే ఆరోగ్యం

బంటుమిల్లి: యుక్త వయస్సు పిల్లల ఆరోగ్యం వారు నియమానుసారంగా ప్రతిరోజు తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉందని ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు అధికారి ఎం.సముద్రవేణి అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం కిశోర వికాసం కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు పెరుగుతున్న కొద్దీ పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత ప్రమాదం ఉండదన్నారు. ఆడపిల్లలు ఈ విషయం ఎంతో జాగ్రత్తలు తీసుకునే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ట్రెనింగ్ ఆఫ్ ట్రైనర్సు(టీఓటీ)లు ఎస్‌కే షబీనా, ఏపీఓ దశరథ్, వై.కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, సుమిత్ర, హెల్త్ సూపర్‌వైజరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు అయ్యప్పకు పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలోని బంగారు అయ్యప్పకు భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పూజా మహోత్సవాల్లో భాగంగా 28వ రోజు స్వామి వారికి పలు ద్రవ్యాలతో అభిషేకాలు చేసి పుష్పాలతో ఓం ఆకారంలో అలంకరించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం జ్యూవలరీ పరిశ్రమ క్లస్టర్‌కు స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్(ఎంఎస్‌ఎంఈ) బ్యాంకింగ్ సేవలను అందించేందుకు గురువారం నగరంలోని హైనీ చర్చి సమీపంలో తమ బ్యాంక్ బ్రాంచ్‌ని ప్రారంభించామని బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ సందీప్‌వర్మ తెలిపారు. ఈ బ్రాంచ్ ద్వారా రోల్డ్ గోల్డ్ పరిశ్రమ నిర్వహిస్తున్న పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇస్తామన్నారు. తొలుత జ్యూవలరీ పార్క్‌లో నిర్వహిస్తున్న డిజిటల్ మార్కెటింగ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ వేమూరి చంద్రమౌళి, జ్యూవలరీ పార్క్ అధ్యక్షుడు పెద్దేటి వెంకట సుబ్బారావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాపాక వెంకట్రావు, జ్యూవలరీ పార్కు కార్యదర్శి అంకెం జితేంద్ర కుమార్, కోశాధికారి నరహరిశెట్టి వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మట్టా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ మొహమ్మద్ రెహమతుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

కిశోరీ వికాసంపై శిక్షణ

అవనిగడ్డ: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరీ వికాసంపై గురువారం శిక్షణ కార్యక్రమం జరిగింది. సీడీపీవో శేషుకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది శైలజ, వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి సునీత లింగవివక్ష, మహిళా హక్కులు, అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు సంపూర్ణ ఆరోగ్యం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొడాలి రెవెన్యూ సదస్సు 28కి వాయిదా

ఘంటసాల: కొడాలి గ్రామంలో ఈనెల 13న జరగాల్సిన రెవెన్యూ సదస్సును ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసినట్లు తహసీల్దార్ బి.విజయ్ ప్రసాద్ గురువారం తెలిపారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడం, ధాన్యం కొనుగోలు, నీటి సంఘాల ఎన్నికల దృష్ట్యా ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు.

సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ

ఘంటసాల: స్థానిక సంస్థలకు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ప్రణాళికలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. ఘంటసాల మండల పరిషత్, వెలుగు కార్యాలయాల సమావేశపు హాలులో స్థానిక సంస్థల స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు 2025–26 ప్రణాళికలపై సర్పంచులు, అన్ని శాఖల అధికారులకు గురువారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోర్కెలు తీర్చే కల్పవల్లి

- రేపటి నుంచి పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు
- ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనున్న జాతర
- 23వ తేదీన అమ్మవారి తెప్పోత్సవం
- ఉచిత దర్శనానికి క్యూలైన్ల ఏర్పాటు



విద్యుద్దీపాలంకరణలో పెడన పైడమ్మ అమ్మవారి దేవస్థానం (ఇన్‌సెట్) పైడమ్మ అమ్మవారు



ఆలయంలో క్యూ లైన్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పెడన: భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన పట్టణంలోని శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 14న ప్రారంభం కానున్నాయి. 11 రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలు 24న ముగుస్తాయి. ఉత్సవాల నిర్వహణ కోసం దేవదాయ శాఖతో పాటు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. వైద్యారోగ్యశాఖ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేస్తోంది. ఆలయ పరిసరాల చుట్టూ జెయింట్ వీల్స్, రంగులరాట్నం, బొమ్మల దుకాణాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రంగుల కోసం మచిలీపట్నం వెళ్లిన పైడమ్మ అమ్మవారు 14న తిరిగి పెడనకు రానున్నారు. అమ్మవారు మచిలీపట్నంలో బయల్దేరినప్పటి నుంచి ఈ జాతర ఉత్సవాలు ప్రారంభమైనట్లుగా నిర్ణయిస్తారు. బంటుమిల్లి రోడ్డులోని కృష్ణమ్మ బావి వద్ద మెట్టినింటి (అత్తవారు) వంశీయులైన దాసు వారు మహా నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పిస్తారు. అక్కడ నుంచి అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరి రాగా ముత్యాలమ్మ ఘంతం వద్ద పుట్టింటి వారైన తోట వంశీయులు మహా నైవేద్యాలను సమర్పిస్తారు. తిరిగి అమ్మవారిని కృష్ణమ్మ బావి వద్దకు తీసుకువెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు, మంగళ హారతులు ఇచ్చి పైడమ్మ అమ్మవారి దేవస్థానానికి 15వ తేదీ ఉదయం తీసుకువెళతారు.

జాతరలో ప్రత్యేకంగా శిడిబండ్లు

ఈ జాతర సందర్భంగా భక్తులు శిడిబండ్లను ఏర్పాటు చేయనున్నారు. ఎడ్ల బండ్లకు లేదా ట్రాక్టర్లకు రెండు లేదా ఒక బొమ్మను కట్టి సుందరంగా అలంకరించి వాయిద్యమేళాలతో ఇంటి నుంచి ఊరేగింపుగా భక్తులు నృత్యాలు చేస్తూ బయల్దేరుతారు. తొలుత బంటుమిల్లి రోడ్డులోని కృష్ణమ్మ బావి వద్ద, గుడివాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఘంతం గుడి వద్ద, పాత కూరగాయల మార్కెట్ వద్ద పోతురాజు స్వామికి, బస్టాండు వద్ద శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద కొబ్బరికాయలు కొట్టి ఊరేగింపుగా పైడమ్మ ఆలయానికి చేరుకుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

23న తెప్పోత్సవం

11 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ మహోత్సవాల్లో చివరి ఘట్టం తెప్పోత్సవం. 23వ తేదీ సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో పైడమ్మ దేవస్థానం వెనుక ఉన్న పైడమ్మ చెరువులో హంస వాహనంపై అమ్మవారికి తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం జనవరి 5వ తేదీన భారీ అన్న సమారాధన నిర్వహిస్తారు. గతంలో కేవలం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, ఆ తరువాత 6 నుంచి 10 వరకు మాత్రమే ఉచిత దర్శనం కల్పించేవారు. ప్రస్తుతం దేవదాయశాఖ పూర్తిగా ఉచిత దర్శనానికి ప్రత్యేకంగా క్యూ లైన్ ఏర్పాటు చేస్తోంది. రూ.10, రూ.25 దర్శనం టికెట్లు పెట్టి క్యూ లైన్లు కూడా ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం



పైడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. పోలీస్, వైద్యం, శానిటేషన్‌లకు సంబంధించి ఆయా శాఖల అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ కమిటీ.పురపాలక పాలకవర్గం కూడా జాతర ఉత్సవాలను సజావుగా సాగేలా పర్యవేక్షించనుంది.

– టీవీవీ మోహనరావు,
ఈవో, పైడమ్మ దేవస్థానం, పెడన

రైతులకు అండగా నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా గురువారం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదేశాల మేరకు రైతులకు సంబంధించి ధాన్యం సేకరణలో జరుగుతున్న అన్యాయంపై రైతులతో కలిసి కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం నుంచి ఉదయం 10 గంటలకు శాంతియుతంగా రైతులతో కలిసి వెళ్లి వినతి పత్రం అందజేస్తామన్నారు. జిల్లాలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

అవనిగడ్డ: పల్లెపండుగ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో మంజూరైన సీసీ రహదారుల పనులను వేగవంతం చేయాలని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.27.15 లక్షల వ్యయంతో 43.95 కిలోమీటర్ల మేర 447 సీసీ రహదారులను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో 191 రోడ్లు పూర్తికాగా మరో 16 రోడ్లు నిర్మాణదశలో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పంచాయితీరాజ్ డీఈ పగడాల సురేష్‌బాబు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.4.31 కోట్ల అభివృద్ధి

కూటమి నేతల తీరుపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు

అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన రూ.4.31 కోట్ల అభివృద్ధి పనులు కనబడాలంటే కళ్లకు కట్టుకున్న గంతలు తీసి చూడాలని కూటమి నేతలకు మాజీ సర్పంచ్, వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు నలుకుర్తి పృథ్వీరాజ్ హితవు పలికారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావుతో కలసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఉన్న సమస్యలపై 'సాక్షి'లో వచ్చిన కథనం నేపథ్యంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు చేసిన విమర్శలపై తీవ్రస్థాయిలో స్పందించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.3.21 కోట్లతో నూతన సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం, రూ.15 లక్షలతో జగనన్న ప్రాణవాయువు, కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు, రూ.50 లక్షలతో ఆధునిక స్కానింగ్ యంత్రం, ఆధునిక జనరేటర్లు ఏర్పాటు చేశారన్నారు. కరోనా సమయంలో అవనిగడ్డలో కోవిడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించి ఆక్సిజన్ కొరత లేకుండా ఎందరో ప్రాణాలను కాపాడిన ఘనత అప్పటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుదే అన్నారు. 108 సిబ్బందికి వైద్యశాల ప్రాంగణంలో సింహాద్రి రమేష్‌బాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు సొంత ఖర్చులతో షెడ్డు వేయించారన్నారు.సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు చింతలపూడి బాలు, గరికపాటి కృష్ణారావు పాల్గొన్నారు.

సాక్షి కథనంతో కూటమి నేతల్లో కలవరం

అవనిగడ్డ: అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో నెలకొన్న సమస్యలపై 'సాక్షి'లో వచ్చిన కథనం కూటమి నేతలను కలవరపాటుకు గురిచేసింది. వైద్యశాలలో పలు సమస్యల వల్ల రోగులు పడుతున్న ఇబ్బందులపై బుధవారం సాక్షి దినపత్రికలో ''వసతుల కొరత.. తప్పని వెత'' శీర్షికతో ప్రత్యేక కథనం వెలువడింది. దీనికి స్పందించి కూటమి నేతలు, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు వైద్యశాలకు వచ్చి హడావుడి చేశారు. ఆస్పత్రి కమిటీ సభ్యుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు ప్రెస్‌మీట్ పెట్టి 'సాక్షి'పై, వైఎస్సార్ సీపీపై అక్కసు వెళ్లగక్కారు. సమస్యలను పక్కదారి పట్టించేలా వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల ఆసుపత్రిని పట్టించుకోలేదని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలల నుంచి అవి చేశాం... ఇవి చేశామని గొప్పలు చెప్పుకున్నారు. తాము పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తీసుకొచ్చిన సాక్షికి కొంతమంది రోగులు కృతజ్ఞతలు తెలపడం కొసమెరుపు.

సమస్యల పరిష్కారానికి సదస్సులే వేదికలు

తలగడదీవి(నాగాయలంక): రెవెన్యూ, సర్వే శాఖలలో కొత్త వినతుల స్వీకరణ, పెండింగ్ అర్జీల పరిష్కారం తదితర అంశాలపై నాగాయలంక మండలం తలగడదీవి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి(బీసీ కార్పొరేషన్ ఈడీ)కె.శంకరరావు నేతృత్వంలో జరిగిన సదస్సులో వివిధ సమస్యలపై అధికారులు 65 అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ శంకరరావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో ప్రజలు, రైతులు తమ పెండింగ్ సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చునన్నారు. మండల తహసీల్దార్ ఎం.హరనాథ్, సర్పంచి భోగాది వెంకటేశ్వరరావు(బుజ్జి), ఎంపీడీఓ జె.కె. సీతారామ్‌కుమార్, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, వైఎస్సార్ సీపీ నేత భోగాది శేషగిరిరావు, జనసేన నాయకుడు బండ్రెడ్డి హరి, గ్రామ రెవెన్యూ అధికారి ఎం.అజయ్, గ్రామ కార్యదర్శి సిహెచ్.సురేష్, సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తలగడదీవి రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న నాగాయలంక స్పెషల్ ఆఫీసర్ శంకరరావు

రెవెన్యూ సదస్సులో 3 అర్జీలు

గూడూరు: లేళ్లగరువు సచివాలయం పరిధిలోని లేళ్లగరువు, గురిజేపల్లి, కలపటం, జక్కంచర్ల గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులలో 3 అర్జీలు వచ్చాయి.

భూ సమస్యలపై 29 అర్జీలు

పెడన: మండల పరిధిలోని పెనుమల్లి గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 29 అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం దిరిశవల్లి, శేరివత్తర్లపల్లి గ్రామాల్లో, మధ్యాహ్నం నేలకొండపల్లి, పెనుమల్లి గ్రామాల్లో సదస్సులు జరిగాయని, అడంగల్ వివరాలలో తప్పులు పడ్డాయని, పాస్‌పుస్తకాలలో, ఫీల్డ్‌లలో కొలతలు తేడాలున్నాయని, మళ్లీ కొలతలు వేయాల్సిందిగా పలువురు కోరినట్లుగా తెలిపారు.

నేడు చోడవరం, పుల్లపాడులో సదస్సులు

శుక్రవారం ఉదయం చోడవరం గ్రామ సచివాలయం వద్ద, మధ్యాహ్నం 2 గంటల నుంచి పుల్లపాడు గ్రామ సచివాయలం వద్ద రెవెన్యూ సదస్సులుంటాయని ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన వారు తమ భూమి సమస్యలు ఏమైనా ఉంటే అర్జీలు ఇవ్వాల్సిందిగా కోరారు.

సాలెంపాలెం రెవెన్యూ సదస్సులో 81 అర్జీలు

కోడూరు: మండలంలోని సాలెంపాలెం పంచాయతీ వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు వివిధ సమస్యలపై 81 అర్జీలను అధికారులకు అందించారు. తహసీల్దార్ శ్రీను నాయక్ పర్యవేక్షణలో సదస్సు జరగ్గా, భూముల సమస్యల గురించి రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. పట్టాదార్ పాస్ పుస్తకాలకు 51, సర్వే కోసం 27, 22(ఏ) సవరణ కోసం మూడు అర్జీలు రైతుల నుంచి అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరణ

మోపిదేవి : మండలంలోని కప్తానుపాలెం రెవెన్యూ సదస్సును పెదప్రోలు సచివాలయం వద్ద సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. గత ప్రభుత్వంలో కప్తానుపాలెంలో నిర్మించిన మల్టీ పర్పస్ గోదామును రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామానికి చెందిన ప్రముఖుడు కేసాని సురేష్‌బాబు తహసీల్దార్ శ్రీవిద్య దృష్టికి తీసుకొచ్చారు.

విద్య తోనే ప్రగతి సాధ్యం

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- 'యానాది గిరిజన మెరుగుదల' ప్రాజెక్ట్ కింద బోట్లు అందజేత
- నాబార్డు–ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో 85 మందికి ఎన్‌జీఓ సహాయం



లబ్ధిదారులకు బోట్‌లు, ఐస్‌బాక్స్ కిట్స్ అందించిన బుద్ధప్రసాద్, ఫిషరీస్ ఏడీ, సంస్థ ప్రతినిధులు

నాగాయలంక: యానాదులు తమ ఆలోచనా విధానాలు మార్చుకుని పిల్లలను చదివించాలని, సామాజికంగా అతి పెద్ద మార్పు రావాలంటే విద్య ఒక్కటే శరణ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎన్‌జీఓ ప్రజాప్రగతి సేవా సంఘం ఆధ్వర్యంలో నాబార్డు–ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఆర్థిక సహకారంతో నాగాయలంక, కోడూరు మండలాలకు సంబంధించిన 'యానాది గిరిజన సంఘం జీవావరణ వ్యవస్థ ఆధారిత జీవనోపాధి మెరుగుదల' ప్రాజెక్ట్ కింద గురువారం 85 మంది లబ్ధిదారులకు సాయం అందించారు. స్థానిక శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్ లోని ఫుడ్‌కోర్టు భవనంలో సంఘం అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 50మంది (ఒక్కో బోటు అయిదుగురికి)లబ్ధిదారులకు పది ఫైబర్ బోట్లు, ఐస్ బాక్స్ కిట్లను, 25మంది లబ్ధిదారులకు కేజ్ కల్చర్ కోసం, 10మంది లబ్ధిదారులకు 5 ఎకరాలలో పీతల పెంపకం కోసం మొత్తం 85 మందికి సహాయం అందజేశారు. ఫిషరీస్ ఏడీ ఆర్.ప్రతిభ, జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, పీపీఎస్ కోఆర్డినేటర్ నక్కా విజయబాబు, స్థానిక మత్స్యకారుల సంఘం నాయకుడు ఎల్.నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

పెడన: విజయవాడ ప్రవీణ్ హాస్పిటల్, ప్రవీణ్ కార్డియాక్ సెంటర్, పెడన పట్టణ హోల్ సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుండె వ్యాధులు, మెదడు నరాలు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేశారు. తొలుత శిబిరాన్ని పెడన పట్టణ హోల్‌సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా ప్రారంభించారు. శిబిరంలో ప్రవీణ్ కార్డియాక్ సెంటర్ హాస్పిటల్ డాక్టర్ పోలగాని విశ్వనాథ్ బృందం వైద్య సేవలను అందించారు. ఈసీజీ, 2 డి ఎకో, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. సుమారు 150 మందికి పైగా వైద్య సేవలను అందించారు.

స్థానికీకరణం అంశంపై శిక్షణ

మోపిదేవి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సక్రమంగా రూపొందించుకుని అమలు చేయడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించవచ్చునని ఎంపీడీవో జె.స్వర్ణ భారతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై గురువారం శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణలో జిల్లా లింక్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొదటిరోజు స్క్రీన్‌పై వివరిస్తూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ ఆవశ్యకత, పంచాయతీ అభివృద్ధి సూచిక, లోకల్ ఇండికేటర్ ఫ్రేమ్‌వర్క్, జీపీడీపీ యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించారు. సహాయ కోర్సు డైరెక్టర్ టీకే ఎస్ సుందరి, వివిధ మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

15న ఐక్య క్రిస్మస్ వేడుక

- క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్
- జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు ర్యాలీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల ఐక్య క్రిస్మస్ వేడుకను ఈ నెల 15వ తేదీ ఆదివారం స్థానిక కోనేరుసెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) ఉమ్మడి కృష్ణా జిల్లాల అధ్యక్షుడు, బెరాకా మినిస్ట్రీస్ చైర్మన్ బ్రదర్ బీఎస్ కిరణ్‌పాల్ తెలిపారు. స్థానిక హైనీ చర్చిలో గురువారం వేడుకలకు సంబధించిన కరపత్రాలను దైవ సేవకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అంతర్జాతీయ దైవ వర్తమానికులు డాక్టర్ జాన్‌వెస్లీ హాజరై క్రిస్మస్ సందేశం ఇస్తారన్నారు. తొలుత సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకూ భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం వేదికపై క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని క్రైస్తవులు, సంఘ సభ్యులు వేలాదిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీసీ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు మేకా విజయరాజు, ప్రతినిధులు నాగిశెట్టి డానియల్, సంతోష్, హైనీ చర్చి ఉపాధ్యక్షుడు ఏలియా, పలువురు పాస్టర్‌లు పాల్గొన్నారు.

నేరాల విచారణలో సీసీ కెమెరాలే కీలకం

బంటుమిల్లి: పోలీసు శాఖకు నేరాల విచారణలో సీసీ కెమెరాలు ఎంతగానో సాయపడుతున్నాయని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో బంటుమిల్లిలో దాతల సహకారంతో పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, మోనిటర్‌ను గురువారం డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన దాదాపు 90 వేల సీసీ కెమెరాల కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. బంటుమిల్లిలో దాతలు ముందుకొచ్చి దాదాపు రూ.2 లక్షల విలువ చేసే సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించినందుకు ఆయన వారికి అభినందనలు తెలిపారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచనలు ఇచ్చామని చెప్పారు. 216 జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా రహదారిపై ఎక్కడ సీసీ కెమెరాలు ఉన్నదీ ఎస్ఐ గణేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణ సరిగా లేని కారణంగా దెబ్బతిన్నాయని స్థానిక కేబుల్ ఆపరేటర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నామని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. సీసీ కెమేరాల ఏర్పాటుకు కృషి చేసిన ఎస్ఐ గణేష్‌కుమార్‌ను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ నాగేంద్రప్రసాద్, దాతలు సాబూజాన్, బాబు, గుప్త, శేఖర్, పండ్లు, పూలకొట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సంఘ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పెడన: సాగునీటి సంఘ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, విధుల్లో ఏమాత్రం పొరపాట్లకు తావీయవద్దని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సాయంత్రం సాగునీటి సంఘాలకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన ఉద్యోగులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

అవనిగడ్డ: ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికలపై సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ, విధుల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు.

గూడూరు: మండలంలోని ఆరు సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలో ముక్కొల్లు, తరకటూరు, రాయవరం, మల్లవోలు, గూడూరు, కోకనారాయణపాలెం సాగునీటి సంఘాలు ఉన్నాయని, వీటికి సంబంధించి ఈనెల 14న ఎన్నికల ప్రక్రియ ఉంటుందని వివరించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

మోపిదేవి: ఈ నెల 14వ తేదీన నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయని తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. మోపిదేవి ఎంఈఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నియమితులైన పోలింగ్ అధికారులకు గురువారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలోని కె కొత్తపాలెం నీటి సంఘాల ఎన్నికకు స్థానిక జెడ్పీ పాఠశాలలోనూ, పెదకళ్లేపల్లి–1 నీటి సంఘాలకు వెంకటాపురం జెడ్పీ పాఠశాలలోనూ, మోపిదేవి నీటి సంఘాల ఎన్నికలకు మోపిదేవి జెడ్పీ పాఠశాలలోనూ, పెదకళ్లేపల్లి–2 నీటి సంఘాల ఎన్నిక పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలోనూ, ఉత్తర చిరువోలులంక నీటి సంఘాల ఎన్నిక కోసూరువారిపాలెం జెడ్పీ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉదయం 9 గంటల వరకే ఓటుకు అనుమతి

ఘంటసాల: ఈనెల 14న జరిగే నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఓటు వేసేందుకు అనుమతి ఉంటుందని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలో చిట్టూరు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు చిట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో, లంకపల్లి నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు లంకపల్లి జెడ్పీ హైస్కూల్లో, శ్రీకాకుళం ఎన్నికలు శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్లస్ ప్రాంగణంలో, ఘంటసాల ఎన్నికలు ఘంటసాల జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో, పాపవినాశనం ఎన్నికలు పాపవినాశనం ప్రాథమిక పాఠశాలలో, చిట్టూర్పు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు చిట్టూర్పు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరుగుతాయని తహసీల్దార్ చెప్పారు.

ఎంటీయూ 1318 వరి రకంపై క్షేత్ర దినోత్సవం

దేవరకోట(ఘంటసాల): రైతులకు మేలు చేసేలా ఎంటీయూ 1318 వరి రకం రూపొందించినట్టు కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశోధనలు రైతులకు క్షేత్రస్థాయిలో అందించాలనే లక్ష్యంతో ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలో ఎంటీయూ 1318 వరి రకంపై గురువారం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ వరి రకం ఎంటీయూ 1318 కాండం దృఢంగా ఉండి చేను పడిపోకుండా ఉంటుందని, నత్రజని తక్కువగా తీసుకుంటుందని చెప్పారు. ఈ రకం పండించిన రైతులు కోటి నాగులు, డి.జానకి రామయ్య అభిప్రాయాలను సేకరించారు. రైతులు మాట్లాడుతూ 1318 వరి రకం పండించడం వలన వాతావరణం మార్పుల వలన చేను పడిపోలేదని, తక్కువ యూరియా వేశామని, ఇతర రకాల కన్నా ఐదు బస్తాలు ధాన్యం అదనంగా వస్తుందని తెలిపారు. అనంతరం పొలంలో వచ్చిన దిగుబడిని అంచనా వేశారు. కార్యక్రమంలో వీఏఏలు సత్యదేవ్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

రాజగోపుర శిఖర మహోత్సవాలు ప్రారంభం

గూడూరు: గూడూరులో ఉన్న శ్రీ వెంకటాచల స్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన రాజగోపుర శిఖర, గోదాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక యాగశాలలను ఏర్పాటు చేశారు. యాగికులు అగ్నిహోత్రం జీవన్‌తేజ, నారాయణ, బాబు, పద్మనాభ భట్టర్ సోదరుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ తిమ్మరాజు కృష్ణకాంత్, ఈఓ మోహనరావు పర్యవేక్షించారు.

టీడీపీ కౌన్సిలర్ నాగమల్లేశ్వరమ్మ మృతి



పెడన: 14వ వార్డు కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ(54) గురువారం రాత్రి మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆమె భర్త పూర్ణచంద్రరావు టీడీపీలో సీనియర్ నాయకుడు. నాగమల్లేశ్వరమ్మ ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గంలో ఏకైక టీడీపీ కౌన్సిలర్. ఆమె మృతి పట్ల చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్ ఖాజా, పలువురు కౌన్సిలర్లు, టీడీపీనాయకులు సంతాపం తెలిపారు.